క్లుప్తంగా

సోమాలమ్మ సన్నిధిలో అన్నసమారాధన



జగ్గంపేటలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న సీఐ లక్ష్మణరావు

జగ్గంపేట: జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న సోమాలమ్మ ఆలయంలో 6వ జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని జగ్గంపేట సీఐ లక్ష్మణరావు ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు రుచిడాబా నాగేంద్ర, శ్రీలలిత జ్యూయలర్స్ లలితబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వివిధ పార్టీల నేతలు, స్థానిక ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ



ఏలేశ్వరంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు మురళీకృష్ణ

ఏలేశ్వరం: గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు టి.మురళీకృష్ణ అర్థమేటిక్, రీజనింగ్‌లపై, మరో ఉపాధ్యాయుడు అప్పన్నబాబు ఖగోళ విజ్ఞానంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ కళలు, చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, స్పోకెన్ ఇంగ్లిషు, మ్యాథ్స్, యోగా తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు.

22 బైక్‌ల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

గోకవరం: స్థానిక డ్రైవర్స్ కాలనీలో సోమవారం పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా నార్త్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, కోరుకొండ సీఐ అడపా నాగమురళీ పర్యవేక్షణలో ఎస్సై కె.నాగరాజు కాలనీలో సిబ్బందితో కలసి కార్డెన్ సర్చ్ నిర్వహించి, రికార్డులు సక్రమంగా లేని 22 బైక్‌లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రానున్న ఎన్నికల కౌంటింగ్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమం చేపట్టామని, వాహన యజమానులు రికార్డులు తీసుకువచ్చి వాటిని తీసుకు వెళ్లాలన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞాన సముపార్జన

శంఖవరం: అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని పెంపొందించేవే గ్రంథాలయాలని గ్రంథాలయాధికారి శవల ప్రియాంక అన్నారు. స్థానిక గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పాటలు, పద్యాలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు గ్రంథాలయంలో లభించే మంచి పుస్తకాలను చదివి ఉన్నత స్థానానికి ఎదగాలని ప్రియాంక సూచించారు.

రోడ్లపైకి వదిలేస్తున్నారు..



తుని రాజా కళాశాల మైదానంలో సంచరిస్తున్న పశువులు

తుని: సమస్య మళ్లీ మొదటికి వచ్చింది.. తుని మున్సిపాలిటీలో రోడ్లపై తిరుగుతున్న పశువులతో ప్రజలకు ఇబ్బంది ఎదురవుతోంది. పశువులను రోడ్లపైకి వదలొద్దని యజమానులకు హెచ్చరికలు జారీ చేస్తున్నా స్పందించడం లేదు. తాజాగా ఏ రోడ్డులో చూసినా కదిలే స్పీడ్ బ్రేకర్లు (పశువులు) దర్శనమిస్తున్నాయి. మార్కెట్‌కు వచ్చే ప్రజలు కొనుగోలు చేసిన కూరగాయలు, ఇతర వస్తువులను తినేస్తున్నాయి. పట్టణంలోని పశువులను పట్టుకుని గోసంరక్షణ కేంద్రాలకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

కుట్టుమెషీన్ అందజేత

బోట్‌క్లబ్: స్థానిక 29వ డివిజన్‌లోని కొయ్యావారి వీధిలో ఉన్న నిరుపేద మహిళ రెడ్డి రమ్యకు బీజేపీ రాష్ట్ర మేధావుల విభాగం రాష్ట్ర కన్వీనర్ ముత్తా నవీన్ సోమవారం కుట్టుమెషీన్ అందించారు. బీజేపీ సౌత్‌మండల అధ్యక్షుడు చెక్కా రమేష్ రెడ్డి రమ్య ఆర్థిక పరిస్థితులు తెలుసుకొని విషయాన్ని ముత్తా నవీన్‌కు తెలుపగా ఆమెకు సేవా సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఆమెకు కుట్టుమిషన్ అందించారు.

ఆనందాల హరిఇల్లు

- పేదల సొంతింటి కల సాకారం
- నియోజకవర్గంలో 11,212 మందికి లబ్ధి
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



రాజుపేట జగనన్న కాలనీలో ఇళ్లు



వి.కొత్తూరు జగనన్న కాలనీలో రూపుదిద్దుకున్న ఇళ్లు

తుని రూరల్: పేదలకు పక్కా ఇళ్లు సమకూరడంతో ఆనందం వెల్లివిరుస్తోంది. జగనన్న ప్రభుత్వంలో వారి సొంతింటి కల సాకారమైంది.. జగనన్న కాలనీలు కొత్త ఊళ్లను తలపిస్తోంది. తుని నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 58 పంచాయతీలు, తుని మున్సిపాలిటీ ఉండగా, 54 జగనన్న కాలనీలు ఏర్పడ్డాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 19 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వగా మొదట విడతగా 11,212 మందికి గృహ రుణాలు మంజూరు చేశారు. ఆయా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా, మరికొంత మంది శరవేగంగా ఇళ్లను నిర్మించుకుని గృహ ప్రవేశాలు చేసుకున్నారు. తుని మండలం రాజుపేట లేఅవుట్‌లో ఒకేచోట తుని పట్టణంలో పేదలకు 5,724 ఇళ్ల స్థలాలు కేటాయించారు. వీరంతా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అలాగే తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి.

నియోజకవర్గంలో వివరాలు ఇలా

మండలం	మంజూరైన ఇళ్లు	పూర్తయినవి	నిర్మాణంలో ఉన్నవి	నిర్మాణం చేపట్టనవి	నిధులు
తుని	2,718	1,098	1618	2	రూ.21,46,23,986
తుని అర్బన్	5,724	1,372	4,349	3	రూ.44,13,92,653
తొండంగి	2,351	1,426	923	2	రూ.24,03,41,459
కోటనందూరు	429	109	226	84	రూ .2,48,11,740

మౌలిక వసతులు కల్పన

ఇళ్ల స్థలాలు, గృహ రుణాలు మంజూరు చేసి వదిలేయకుండా ప్రభుత్వం ఆయా జగనన్న కాలనీల్లో విద్యుత్, తాగునీరు, గ్రావెల్ రోడ్లు వంటి కనీస సదుపాయాలు కల్పించింది. తుని పట్టణంలో పేదల కోసం ఏర్పాటు చేసిన రాజుపేట లేఅవుట్, ఎస్.అన్నవరం లేఅవుట్లలో ఏకంగా విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణమే చేపట్టింది. విద్యుత్ స్తంభాలు, వీధి లైట్లను అమర్చారు. తాగునీటికి అవసరమైన బోరు బావులు, వాటికి విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. ఆయా కాలనీలకు రహదారి సౌకర్యం కల్పించారు.

ఉచితంగా ఇసుక

జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.1.80 లక్షల ఆర్థిక సాయం అందించింది. దీంతో పాటు ఉచితంగా ఇసుక, రాయితీపై సిమెంట్, ఇనుము, డ్వాక్రా సంఘాల సభ్యులకు రూ.50 వేల వరకూ అదనంగా రుణాలు మంజూరు చేశారు. పట్టణ పేదలకు ప్రైవేట్ సంస్థల నుంచి మరో రూ.3 లక్షల రుణ మంజూరుకు అధికారులు సహకరిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేశారు.

అద్దె ఇంటి కష్టాలు తీరాయి



ఉమ్మడి కుటుంబంతో 12 సంవత్సరాలకు పైగా అద్దె ఇంట్లోనే కాపురం ఉన్నాం. అద్దె ఇళ్లల్లో ఎన్నో ఇబ్బందులు పడ్డాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇంటి స్థలం ఇచ్చి, గృహ నిర్మాణానికి రుణం మంజూరు చేసింది. దాంతో ఇల్లు నిర్మించుకుని సొంతింట్లో నివాసం ఉంటున్నాం.

– మేరపురెడ్డి అరుణ, వి.కొత్తూరు, తుని మండలం

పైసా లంచం ఇవ్వకుండా..



మాది రెక్కాడితేనేగాని డొక్కాడని కుటుంబం. అటువంటి మేము సొంతింట్లో ఉంటామని ఊహించలేదు. సీఎం జగన్ పుణ్యమా అని సొంతిల్లు కట్టుకున్నాం. పిల్లలతో సంతోషంగా ఉంటున్నాం. కరెంట్ వచ్చింది. ఇంటి దగ్గరే తాగునీటి కుళాయి ఉంది. ఎవరికీ పైసా లంచం ఇవ్వకుండానే ఇల్లు సమకూరింది.

– బద్దా వెంకటలక్ష్మి, లోవకొత్తూరు, తుని మండలం

పశువుల సంతలో వసతులు కల్పించండి



జగ్గంపేటలో పశువుల సంత నిర్వాహకులతో మాట్లాడుతున్న జేడీ సూర్యప్రకాశరావు

జగ్గంపేట: జగ్గంపేటలో పశువుల సంత నిబంధనలకు విరుద్ధంగా సాగుతోందని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ ఎస్.సూర్యప్రకాశరావు తెలిపారు. సోమవారం స్థానిక గుర్రంపాలెం రోడ్డులో ఉన్న పశువుల సంతను ఆయన పరిశీలించారు. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా మోనటరింగ్ కమిటీ ఏర్పాటు, వసతులు కల్పించే వరకూ సంత నిర్వహించవద్దని జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చినా సంత ఎందుకు నిర్వహిస్తున్నారని ఆయన నిర్వాహకులను ప్రశ్నించారు. పది రోజులు గడువు ఇస్తున్నామని, అప్పటికీ వసతులు కల్పించకపోతే సంత నిర్వహణను అడ్డుకుంటామని హెచ్చరించారు. సీసీ కెమేరాల ఏర్పాటు, పశువులకు నీటి తొట్టెలు, గడ్డి, నీడ కల్పించాలని, వాహనాలు ఎక్కించడానికి ర్యాంప్, అలాగే సంతకు వచ్చేవారికి సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు

గోకవరం: గంగంపాలెం గ్రామ శివారులో సారా బట్టీలపై సోమవారం గోకవరం పోలీసులు దాడులు చేశారు. ఈ సందర్భంగా బట్టీలో తయారీకి సిద్ధంగా ఉంచిన వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచిన సుమారు వంద లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై నాగరాజు తెలిపారు.

నీరు లేక మూగజీవాలకు పాట్లు



ఏలేరు కాలువలో నీరు లేక వెలవెల

ఏలేశ్వరం: వేసవి ఎండలకు ఏలేరు కాలువలో నీటి సరఫరా తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా నిలిపివేయడంతో కాలువలో జలాలు అడుగంటాయి. దీంతో మూగజీవాలు నానా పాట్లు పడుతున్నాయి. మండల వ్యాప్తంగా ఏలేశ్వరం, తిరుమాలి, యర్రవరం గ్రామాల మీదుగా సుమారు ఏడు కిలో మీటర్ల మేర ఏలేరు కాలువ ఉంది. ప్రతి వేసవికి ఆయా గ్రామాల్లోని పశువులు ఏలేరు కాలువలో నీటిపై ఆధారపడతాయి. వేసవిలో సాయంత్రమైతే కాలువలో వీటిని శుభ్రం చేసి తాగునీటి అవసరం తీర్చుతుంటారు. ప్రస్తుతం ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టడంతో సరఫరా నిలిపివేశారు. మిగులు జలాలు కొంతమేర వస్తున్నాయి. దీంతో తాగునీటి కోసం పశువులు అల్లాడుతున్నాయి. గ్రామాల్లో పశువులకు నీటితొట్టెలు నిర్మించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

తొలకరి సాగుకు సన్నద్ధం

- జోరుగా పంట దుక్కులు
- వర్షంతో వ్యవసాయానికి అనుకూలం



తొండంగి మండలం ఎ.కొత్తపల్లిలో పొలాన్ని ట్రాక్టర్‌తో దుక్కి చేస్తున్న రైతు

తొండంగి: రెండు రోజుల కిందట కురిసిన కుండపోత వర్షానికి నేల పదునెక్కడంతో తొలకరి సాగుకు రైతన్నలు సన్నద్ధమయ్యారు. పొలాలను దుక్కి చేస్తూ పనులను ముమ్మరం చేశారు. వేసవిలో ఎండ తీవ్రతతోపాటు అడపాదడపా కురిసిన వర్షాలతో పొలాలు పదునెక్కాయి. కొద్ది రోజుల కిందట కురిసిన కుండపోత వర్షంతో మెట్ట, పల్లపు ప్రాంతాల్లో పొలాలన్నీ దుక్కి చేసేందుకు అనువుగా మారాయి. దీంతో రైతులు తమ పొలాలను ట్రాక్టర్లతో దుక్కి చేస్తున్నారు. దుక్కి చేసిన నారుమడుల్లో తొలకరి వర్షాలకు ముందే అనుకూలత బట్టి విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఖరీఫ్ సాగుకు చేపట్టాల్సిన కార్యాచరణపై గ్రామాల్లో వ్యవసాయ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. దీంతో రైతులు వ్యవసాయ పనులను ప్రారంభించారు. పొలాలను దుక్కి చేయించి భూసారాన్ని పెంచేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. తొలకరి వర్షాలు ప్రతి ఏటా జూన్ మొదటి లేదా రెండో వారం నుంచి ప్రారంభమవుతాయి. అప్పటి నుంచి సాగు పనులు మరింత ముమ్మరం కానున్నాయి.

తొలగిన తుపాను ఆందోళన

రెండు రోజుల కిందట బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం రెమాల్ తుపానుగా మారి పశ్చిమబెంగాల్‌లో సాగర్ ఐలాండ్ వద్ద తీరం దాటింది. దీని ప్రభావం రాష్ట్రంపై ఉండదని వాతావరణ శాఖ ప్రకటించినప్పటికీ ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో ఓ మోస్తారు వర్షాలు కురుస్తాయని తెలిపింది. దీనికి బలం చేకూరుస్తూ రెండు రోజుల కిందట కురిసిన కుండపోత వర్షాలతో వాతావరణం చల్లబడింది. అలాగే ఆకాశం మేఘావృతమై వాతావరణం మాగుడుగా, ఉక్కపోతగా మారింది. తుపాను ప్రభావంతో ఈదురు గాలులు, వర్షాలతో జీడిమామిడి, అరటి, మామిడి రైతులు ఆందోళన చెందారు. ఆ ప్రభావం పూర్తిగా తొలగిపోవడంతో ఊపిరి పీల్చుకుంటున్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు ఐదుగురు ఏఆర్వోలు

శిక్షణ ఇచ్చిన ఆర్వో వెంకటరావు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్వో వెంకటరావు

కాకినాడ: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కించే ప్రక్రియ పర్యవేక్షించేందుకు ఐదుగురు ఏఆర్వోలను నియమించారు. ఏఆర్వోలుగా నియమితులైన ధర్మతేజ, కృష్ణార్జునరావు, రవికుమార్, లక్ష్మీప్రసన్న, కీర్తిలకు సోమవారం సాయంత్రం సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జే వెంకటరావు శిక్షణనిచ్చారు. ఏఆర్వోలతోపాటు కౌంటింగ్ సూపర్‌వైజర్లు కూడా ఈ శిక్షణలో పాల్గొన్నారు. నాలుగో తేదీ ఉదయం 6 గంటలకల్లా విధులకు హాజరు కావాలని వీరిని ఆయన ఆదేశించారు. ఎన్నికల మార్గదర్శకాలకు అనుగుణంగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఆ ప్రక్రియను ఎటువంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఏఆర్వో చల్లన్నదొర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ చిక్కుముడి వీడేనా!



కోటనందూరు బస్టాండు సెంటర్‌లో నిలిచిపోయిన ట్రాఫిక్

కోటనందూరు: స్థానిక బస్టాండ్ సెంటర్ ట్రాఫిక్ దిగ్బంధంలో కొట్టుమిట్టాడుతోంది. ఇక్కడ తరచూ వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులతో పాటు స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. తుని, నర్సీపట్నం పట్టణాల మధ్య ప్రధాన సెంటర్ ఇది. అనకాపల్లి– కాకినాడ జిల్లాల్లోని సుమారు 50 గ్రామాల ప్రజలు ఈ బస్టాండ్ కేంద్రంగా ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ రోజంతా ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. ఇలాంటి బస్టాండ్ సెంటర్‌లో ట్రాఫిక్ నియంత్రణపై అధికారులు నిర్లక్ష్యం వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆటోవాలాలు, వ్యాపారులు ఇష్టారాజ్యంగా రోడ్డును ఆక్రమించి ట్రాఫిక్ సమస్యను సృష్టిస్తున్నారు. దశాబ్దాలుగా తాత్కాలిక చర్యలతో ఇక్కడ తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించడం లేదు. అధికారులు సమస్య మూలాలపై దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. మరోపక్క ఇక్కడ వ్యాపారం చేసుకునే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు రాత్రివేళ రోడ్డును అధ్వానంగా మారుస్తున్నారు. ప్లేట్లు శుభ్రం చేసిన నీళ్లను రోడ్డుపై పోస్తున్నారు. ఈ నీటితో దుర్వాసన వెదజల్లడంతో పాటు ద్విచక్ర వాహనదారులు జారి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ దుస్థితిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు



గెడ్లబీడు వద్ద అవగాహన కల్పిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గండేపల్లి: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు కృషి చేయాలని ఎంపీడీఓ ఎస్.హనుమంతరావు తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల నియమావళి అమలుపై పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలకు అవగాహన కల్పించారు. సెక్షన్లు 144, 33 అమలులో ఉన్నందున ప్రజలు గుంపులు, గుంపులుగా తిరగవద్దని, రాజకీయ విభేదాలు, కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని అన్నారు. రౌడీషీటర్ల కదలికపై అధికారులు డేగకన్ను వేయాలన్నారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటే తక్షణమే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. నిబంధనలు పాటించని అధికారులపై ఎలక్షన్ కమిషన్ తీవ్ర చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మూర్తి, ఏఓ చంద్రరావు, కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలు నిషేధం

జగ్గంపేట: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఈ నెల 4న జరగనున్న నేపథ్యంలో ఆ ప్రక్రియ పూర్తయ్యే వరకూ మండలంలో మందుగుండు సామగ్రి తయారీ, అమ్మకాలు, నిల్వ చేయడాన్ని నిషేధించామని జగ్గంపేట సీఐ లక్ష్మణరావు తెలిపారు. జగ్గంపేట శివారు మాట్లగుంట వద్ద మందుగుండు సామగ్రి తయారీ, బాణసంచా విక్రయ కేంద్రాన్ని మండల అధికారులు సోమవారం పరిశీలించారు. ఎన్నికల నిబంధనల్లో భాగంగా బాణసంచా అమ్మకాలు, తయారీని నిషేధిస్తున్నట్లు నిర్వాహకులకు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ ఇంతియాజ్ పాషా, జగ్గంపేట ఎస్సై నాగార్జునరాజు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

తుని రూరల్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం గెడ్లబీడు వద్ద సాయివేదికలో కౌంటింగ్ ప్రక్రియ, 144 సెక్షన్, ఎన్నికల నియమావళి అమలుపై ఏజెంట్లకు, వివిధ రాజకీయ నాయకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు, రాజకీయ పక్షాల సహకారంతో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందన్నారు. అదే విధంగా జూన్ 4న కౌంటింగ్ పూర్తయినా జూన్ ఆరు వరకూ ఎలక్షన్ కోడ్ అమలులో ఉంటుందన్నారు. గెలుపోటములు సహజమన్నారు. ప్రజా నిర్ణయాన్ని నాయకులు, కార్యకర్తలు ఆమోదించాల్సిందే అన్నారు. ఘర్షణలకు పాల్పడి ఎఫ్ఐఆర్ నమోదైతే జీవితాలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ఒకసారి ఎఫ్ఐఆర్ నమోదైతే సమగ్ర వివరాలు ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా వద్ద ఉంటాయన్నారు. దాంతో మీ పిల్లల ఉద్యోగ, విదేశీయానంలో సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులకు సహకరించాలన్నారు. తుని సదస్సుతో జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో అవగాహన సదస్సులు పూర్తయ్యాయన్నారు. ఏఎస్పీ పాపారావు, డీఎస్పీ లతాకుమారి, తుని రూరల్, పట్టణ సీఐలు ఎస్‌వీవీఎస్ మూర్తి, గీతారామకృష్ణ, పోటీలో ఉన్న అభ్యర్థుల ఏజెంట్లు, నాయకులు, తుని, కోటనందూరు, తొండంగి, పట్టణ ఎస్సైలు పాల్గొన్నారు.

కలసిమెలసి మెలగాలి

శంఖవరం: గ్రామాల్లో ప్రజలు కలసిమెలసి మెలగాలని తహసీల్దార్ వి.రాజకుమారి, అన్నవరం ఎస్సై ఐ.కిశోర్ అన్నారు. కత్తిపూడి పంచాయతీ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడే నేపథ్యంలో అంతా సామరస్యంగా మెలగాలన్నారు. అల్లర్లు, ఘర్షణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు.

ఉప్పలపాడులో..

గండేపల్లి: అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని గండేపల్లి అడిషనల్ ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. ఉప్పలపాడులో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్నికల లెక్కింపు అనంతరం గ్రామంలో కొట్లాటలు, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా, శాంతియుతంగా మెలగాలన్నారు.



కత్తిపూడి సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై కిశోర్



సమావేశంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ హనుమంతరావు



జగ్గంపేటలో బాణసంచా తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ లక్ష్మణరావు, తహసీల్దార్ పాషా

రెండు మోటారుసైకిళ్లు ఢీ

సామర్లకోట: స్థానిక పెద్దాపురం రోడ్డు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద సోమవారం సాయంత్రం పెద్దాపురం నుంచి సామర్లకోట వస్తున్న మోటారు సైకిల్‌ను వెనుక నుంచి వస్తున్న మరో మోటారు సైకిల్ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ముందు వస్తున్న బైక్‌పై ఎలమిల్లి నుంచి అమ్మగారి ఇంటికి తన సోదరునితో వస్తున్నర్న పెరుగుల లలితలను వెనుక వస్తున్న మోటారు సైకిల్‌లో ఉదయ్ అనే యువకుడు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో లలిత సోదరుడు, ఆమెతోపాటు ఉన్న చిన్న పాపకు ఎలాంటి గాయాలు అవ్వలేదు. లలితకు, ఉదయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు పెద్దాపురం ఏరియా ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి పెద్దాపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. లలిత స్థానిక గణేష్ కాలనీకి, ఉదయ్ అమ్మాజమ్మ అపార్టుకు వస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

వరకట్న వేధింపులపై కేసు

కరప: వరకట్న వేధింపులపై కేసు నమోదు చేసినట్లు కరప ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. యానాంకు చెందిన వెంటి నీలవేణికి కరప మండలం వలసపాకల గ్రామానికి చెందిన ప్రైవేట్ బస్సు డ్రైవర్ వెంటి నూకరాజుతో 2020లో వివాహమైంది. ఆ సమయంలో నీలవేణి తల్లిదండ్రులు రూ.5 లక్షలు, లాంచనాలు ఇచ్చారు. వీరికి 2021లో అమ్మాయి పుట్టింది. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేయడమే కాకుండా భౌతికంగా, మానసికంగా హింసిస్తున్నారని ఆమె కరప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు భర్త వెంటి నూకరాజు, మావయ్య తాతారావు, అత్తయ్య అనసూయ, ఆడపడచు యారికుర్తి దుర్గ, ఆడపడచు భర్త యారకుర్తి దుర్గారావులపై కేసు నమోదు చేశారు.